పశు బీమాకు మంగళం

- పాడి రైతుల కష్టాలు పట్టని కూటమి ప్రభుత్వం
- బీమా ప్రీమియం కట్టించుకోవాలంటున్న అన్నదాతలు
- పశువులు మృత్యువాత పడితే పైసా కూడా రాదని ఆవేదన
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పక్కాగా పశు బీమా వర్తింపు


పాడి ఆవులు

రొళ్ల: కూటమి ప్రభుత్వం పశు బీమాకు మంగళం పాడింది. దీంతో పాడినే నమ్ముకొని బతుకున్న వారంతా తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనుకోని విపత్తు ఏం జరిగినా పశువులు మృత్యువాత పడుతుంటాయని, అయితే పశు బీమా లేకపోవడంతో తాము నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు.

పొంచి వున్న వ్యాధులు

ప్రస్తుతం గేదెలకు హెచ్ఎస్‌బీక్యూ, గాలికుంట, థైలేరియా తదితర వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువ శాతం ఉంది. ప్రాణాంతక వ్యాధులు సోకడం వల్ల పశువులు తరుచుగా మృత్యువాత పడుతుంటాయి. వీటికి తోడు వర్షాకాలంలో రోడ్డు ప్రమాదాలు, ప్రకృతి వైపరీత్యాలు, విద్యుత్ ఘాతాలు సంభవించినప్పుడు కూడా పశువులు ఎక్కువగా మృత్యువాత పడుతున్నాయి. రైతులు వేలాది రుపాయిలు వడ్డీకి తెచ్చుకుని కొనుగోలు చేసిన పశువులు అర్ధాంతరంగా మృతి చెందితే ఆ రైతు పడే బాధ వర్ణనాతీతం. ఈ నేపథ్యంలోనే బీమా పథకాల ద్వారా సహాయం అందితే పాడి రైతులకు కొంత వరకు ఉపశమనం కలిగించేవి.

గతమెంతో ఘనం..

అధికారంలోకి వచ్చిన వెంటనే పశుపోషణ అభివృద్ధి కోసం బీమా సౌకర్యం కల్పిస్తామని కూటమి నేతలు ఇచ్చిన హామీ నీటి మీద రాతగానే మారింది. ఒకో గేదె, ఆవుకు రూ.30 వేల నుంచి 90 వేల వరకూ చెల్లించి పాడి రైతులు కొనుగోలు చేస్తుంటారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పశు బీమ పథకాన్ని పక్కాగా అమలు చేసింది. ఆవు మృత్యువాత పడితే రూ.15 వేలు, పాడి ఆవు చనిపోతే రూ.30 వేలు పరిహారం అందించి ఆదుకుంది. అయితే ఇప్పుడు కూటమి ప్రభుత్వం పశు బీమాకు మంగళం పాడటంతో పాడి రైతులు ఇబ్బందిపడుతున్నారు. గతంలో ప్రభుత్వం తరుపున పశువైద్యాధికారులు ఇచ్చిన సర్టిఫికెట్ ఆధారంగా ఇన్సురెన్స్ ప్రీమియం చెల్లించాల్సి ఉండేది. అందులో రైతు వాటా కింద 3.5 శాతం, ప్రభుత్వం 3.5 శాతం బీమా ప్రీమియం భరించేది. దీనివల్ల రైతుకు కొద్ది వరకు ఉపయోగంగా ఉండేది. అలాగే క్షీరసాగర పథకం ద్వారా 6, 7 నెలల గర్భంతో ఉన్న గేదె, ఆవుకు బీమా సౌకర్యం ఉండేది. ప్రస్తుతం బీమా లేకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బీమా సౌకర్యం కల్పించాలి



ప్రభుత్వం ద్వారా ఆవు, గేదెలకు బీమా సౌకర్యం కల్పించాలి. ప్రస్తుతం ప్రీమియం మొత్తాన్ని చెల్లిస్తామని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్తే ఉత్తర్వులు రాలేదని చెబుతున్నారు. ప్రమాదవశాత్తూ జీవాలు మృత్యువాత పడితే పూర్తిగా నష్టపోతున్నాం. ప్రస్తుతం రెండు పాడి ఆవులను రూ.1.65 లక్షలకు కొనుగోలు చేసి పోషిస్తున్నాను. పశు బీమాను ప్రభుత్వం వెంటనే పునరుద్ధరించాలి.

– గోవిందరాజు, గుడ్డగురికి, రొళ్ల మండలం

మడకశిర నియోజకవర్గంలో పశు సంపద వివరాలు..

మండలం	ఆవుల సంఖ్య	గేదెల సంఖ్య	గొర్రెల సంఖ్య	మేకల సంఖ్య
రొళ్ల	8,694	4,760	64,313	9,388
అగళి	7,869	3,879	65,138	4,847
గుడిబండ	9,298	3,956	1,27,707	12,989
అమరాపురం	16,759	5,436	70,703	6,136
మడకశిర	18,275	7,948	2,03,648	11,218

ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందలేదు

ప్రస్తుతం ఆవు, గేదెలు ఇతరాత్ర పెంపుడు జీవాలకు సంబంధించి బీమా ప్రీమియం కట్టించుకొనేందుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు లేవు. జీవాలకు బీమా సౌకర్యం అవసరమని చాలా వరకు రైతులు మా దృష్టికి తీసుకొచ్చారు. గతంలో రూ.30 వేలు విలువైన ఆవుకు రూ.290 రైతు వాటా కింద ప్రీమియం కట్టించుకున్నాం. ఇన్సూరెన్స్‌కు సంబంధించి ఇప్పటి వరకూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాలేదు. వచ్చిన వెంటనే రైతులకు తెలియజేస్తాం.

– పెంచలయ్యా, డీడీ, పశుశాఖ, హిందూపురం డివిజన్

ఆస్పత్రి నిర్మాణానికి చర్యలు తీసుకోండి


మంత్రికి వినతి పత్రం సమర్పిస్తున్న నాయకులు

రొద్దం: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శిథిలావస్థకు చేరి వైద్యసేవలు అందించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆస్పత్రి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని మంత్రి సత్యకుమార్‌కు రొద్దం బీజేపీ నాయకులు విన్నవించారు. పెనుకొండ వై జంక్షన్‌లో ఆరోగ్యశాఖ మంత్రిని కలిసిన మండల నాయకులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిస్థితిని వివరించారు. గత ప్రభుత్వం ఆస్పత్రి నిర్మాణ పనులు ప్రారంభించిందని, అయితే నేటికీ పునాదులకే పరిమితమైందన్నారు. 20 పడకల ఆస్పత్రి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన మంత్రి పనులు వెంటనే ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు పవన్‌కుమార్, నీరుగంటి వేణు, తొగటు రవిశంకర్, మహదేవ, తిప్పేస్వామి, శ్రీనివాస్‌రెడ్డి, రాజు, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనపై దృష్టిసారించాలి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఆచార్య అజిత్ కుమార్, సీఐ రాజగోపాల్ తదితరులు

హిందూపురం: ప్రతి విద్యార్థి లక్ష్య సాధనపై దృష్టి సారిస్తే ఉన్నతస్థానాలకు చేరుకోవచ్చుని బెంగళూరు వీడియం ఇండియా ఆన్‌ది మూవీ వ్యవస్థాపకులు ఆచార్య అజిత్ కుమార్ అన్నారు. బీఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ ఆధ్వర్యంలో డిప్లొమా కోర్సులో కొత్తగా చేరిన విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఆచార్య అజిత్ కుమార్, వన్‌టౌన్ సీఐ రాజగోపాలనాయుడు, కళాశాల చైర్మన్ డాక్టర్ పి.చంద్రమోహన్ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు, సలహాలిచ్చారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

వెండి హారతి పళ్లెం వితరణ


వెండి హారతి పళ్లెం అందజేస్తున్న ఎంపీటీసీ

రొద్దం: మండల పరిధిలోని కలిపి గ్రామంలో వెలసిన ముత్యాలమ్మదేవి ఆలయానికి వైఎస్సార్‌సీపీ నారనాగేపల్లి ఎంపీటీసీ పద్మావతి వెండి హారతి పళ్లెం సమర్పించారు. శుక్రవారం ఆలయానికి చేరుకున్న ఎంపీటీసీ కుటుంబ సభ్యులు ముందుగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయల పూజారికి వెండి హారతి పళ్లాన్ని అందించారు.

ద్రాక్ష అలంకరణలో కెంచమాంబదేవి



అమరాపురం: మండల పరిధిలోని గొడనకుంటలో వెలసిన కెంచమాంబదేవిని ద్రాక్ష పండ్లతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

తహసీల్దార్‌కు సన్మానం


తహసీల్దార్‌ను సత్కరిస్తున్న నాగభూషణ

లేపాక్షి: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ అవార్డు తీసుకున్న లేపాక్షి తహసీల్దార్ సౌజన్యలక్ష్మిని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి నాగభూషణతో నాయకులు శుక్రవారం సత్కరించారు. భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు తీసుకోవాలని ఆకాంక్షించారు.

స్కాలర్‌షిప్ అందజేత

రొద్దం: ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఇతర విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని, విద్యార్థులు తమ లక్ష్య సాధనకోసం కృషిచేయాలని బయోస్టాండ్ ఇండియా లిమిటెడ్ కంపెనీ ప్రతినిధి ఏఎస్ఎం సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తురకలాపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభను కనబర్చిన విద్యార్థులకు బయోస్టాండ్ ఇండియా కంపెనీ ఆధ్వర్యంలో 10 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ 2,500 చొప్పున రూ.25 వేలు ఆర్థిక సాయం (ప్రగతి స్కాలర్ షిప్పులు) అందించారు.

కొల్హాపురి మహాలక్ష్మికి పూజలు


అలంకరణలో మహాలక్ష్మి

రొళ్ల: రత్నగిరి గ్రామంలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవికి ఆఖరి శ్రావణ శుక్రవారం సందర్భంగా ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకం, అంకురార్పణ, కుంకుమార్చన, తులసీ పూజ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కొత్తపాళ్యంలో వెలసిన వెంకటేశ్వర స్వామి ఆలయంలో కూడా ఆఖరి శ్రావణ మాసం శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.

చవితి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోండి

- డీఎస్పీ నరసింగప్ప


వినాయక ఉత్సవ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ నరసింగప్ప

గోరంట్ల: వినాయక చవితి వేడుకలను ప్రజలందరూ ప్రశాంతంగా జరుపుకోవాలని, గొడవలకు తావులేకుండా చూసుకోవాలని పెనుకొండ డీఎస్పీ నరసింగప్ప పేర్కొన్నారు. వినాయక చవితి నేపథ్యంలో శుక్రవారం పోలీసుస్టేషన్ ప్రాంగణంలో వినాయక ఉత్సవ కమిటీతో పాటు పీస్ కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వినాయక ప్రతిమలను ఏర్పాటు చేసే నిర్వాహకులు కచ్చితంగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. వినాయక ప్రతిమలు ఏర్పాటు చేసేనప్పటి నుంచి నిమజ్జనం చేసే వరకూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ శేఖర్, తహసీల్దార్ మారుతీ , గ్రామ పెద్దలు ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లను ఆదుకోవాలి


ఆటో కార్మికులను ఆదుకోవాలని నినదిస్తున్న ఆటోడ్రైవర్లు, యూనియన్ నాయకులు

హిందూపురం: రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం మంచి శుభ పరిణామమే. అయితే దాని వల్ల ఆటోడ్రైవర్ల బతుకు భారంగా మారిందని సీఐటీయూ పట్టణ కన్వీనర్ రాము అన్నారు. ఆటో కార్మికులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఆటో కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఏడాది రూ.20 వేలు వాహన మిత్ర కింద సహాయం అందించాలన్నారు. లేకపోతే ఆటో కార్మికులతో కలసి పోరాటాలు చేస్తామన్నారు. సీఐటీయూ పట్టణ కోకన్వీనర్ రామకృష్ణ , ఆటో వర్కర్స్ యూనియన్ బాబురెడ్డి, బాబా, నరసప్ప, అంజనప్ప, రామంజి, కుమార్, చంద్ర, గోపాల్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

డివిజనల్ విద్యాశాఖ అధికారిగా అదనపు బాధ్యతలు

గోరంట్ల: పెనుకొండ డివిజనల్ విద్యాశాఖ అధికారిగా గోరంట్ల మండల విద్యాశాఖ అధికారిగా పని చేస్తున్న జాన్‌రెడ్డప్పకు అదనపు బాధ్యతలను శుక్రవారం విద్యాశాఖ ఉన్నతాధికారులు అప్పగించారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. డివిజినల్ విద్యాశాఖ అధికారిగా పని చేస్తున్న పద్మప్రియ 3 నెలల క్రితం రిటైర్ అయ్యారు. అప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగా ఉంది. జాన్ రెడ్డప్పకు గోరంట్ల మండల విద్యాశాఖ అధికారితో పాటు డివిజనల్ విద్యాశాఖ అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించారు.

జూదరుల అరెస్ట్

గుడిబండ: మండల పరిధిలోని దేవరహట్టి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.8,100 స్వాధీనం చేసుకున్నామన్నారు. పరారీలో ఉన్న వారి కోసం గాలిస్తున్నామని పేర్కొన్నారు.

పొదుపు సంఘాల బలోపేతానికి కృషి

రొళ్ల: గ్రామాల్లో డ్వాక్రా మహిళా సమైక్య సంఘాలను యానిమేటర్లు, సీసీలు సంయుక్తంగా కలిసి బలోపేతం చేయడానికి కృషి చేయాలని ఇన్‌చార్జ్ వెలుగు ఏపీఎం నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయం ఆవరణలో రొళ్ల, అగళి మండలాల యానిమేటర్లు, సీసీలతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. బ్యాంక్ లావాదేవీలు, రికార్డు నిర్వహణ, రుణాలు రికవరీ తదితర వాటిపై చర్చించారు.

నిబంధనల మేరకు ఎరువులు విక్రయించాలి

రొళ్ల: ప్రభుత్వం నిర్ధారించిన ధరల ప్రకారం రైతులకు ఎరువులు విక్రయించాలని తహసీల్దార్

సంక్షిప్త సమాచారం

షేక్షావలి పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం పట్టణంలోని విజయలక్ష్మి తదితర ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. తొలుత రికార్డులు పరిశీలించి స్టాకు, సేల్స్ వివరాల పై ఆరా తీశారు. తహసీల్దార్ మాట్లాడుతూ అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు.

యల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ


విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న మంత్రి సవిత

పెనుకొండ రూరల్: మండలంలోని వెంకటగిరిపాళ్యంలో గ్రామస్తులు నూతనంగా యల్లమ్మ ఆలయాన్ని నిర్మించారు. ముఖ్య అతిథిగా హాజరైన బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకొన్నారు. గ్రామస్తులు భక్తులకు అన్నదానం చేశారు.

పింఛన్లను పునరుద్ధరించాలి

అమరాపురం: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల దివ్యాంగుల పింఛన్లను రద్దు చేస్తూ లబ్ధిదారులకు నోటీసులు జారీ చేసిందని, పింఛన్లు రద్దు చేయకుండా పునరుద్ధరించాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు శివన్న డిమాండ్ చేశారు. నియోకవర్గంలో 450 మందికి పైగా దివ్యాంగుల పింఛన్లు రద్దు చేస్తూ నోటీసులివ్వడం దారుణమన్నారు.

విజేతలకు బహుమతులు

పెనుకొండ: పట్టణంలోని షిర్డిసాయి గ్లోబల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మట్టి గణపతి వినియోగం – దాని ప్రాధాన్యతపై ఇటీవల వివిధ పాఠశాలల విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలచిన విద్యార్థులుకు బహుమతులను శుక్రవారం అందజేశారు.

యువకుడి వద్ద కత్తి స్వాధీనం

హిందూపురం: మరణాయుధాలను ద్విచక్ర వాహనంలో ఉంచుకుని తిరుగుతుండగా ఇద్దరు యువకుడిని శుక్రవారం వన్ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. భాస్కర్ అనే యువకుడి వాహనాన్ని తీసుకొని తిరుగుతున్న నవీన్ వద్ద కత్తి లభ్యమైంది. దీంతో వన్‌టౌన్ పోలీసులు నవీన్‌ను పోలీసుస్టేషన్‌కు తీసుకువచ్చి విచారిస్తున్నారు. పూర్తి వివరాలు విచారణ అనంతరం చెబుతామని సీఐ రాజగోపాల్ పేర్కొన్నారు.

వీధి కుక్కలకు టీకాలు

పావగడ: పట్టణంలో వీధి కుక్కల బెడద తీవ్రమైన నేపథ్యంలో వాటి నివారణ, ప్రజల రక్షణ కోసం స్థానిక మున్సిపల్‌శాఖ, పశు చికిత్స వైద్యశాల సంయుక్తంగా కుక్కలకు రేబిస్ టీకాల అభియాన కార్యక్రమాన్ని మొదలు పెట్టింది. స్థానిక మున్సిపల్ చైర్మన్ సుదేశ్ కుమార్ శుక్రవారం ఆ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పట్టణంలో 500 కుక్కలకు టీకాలు వేస్తున్నామన్నారు.

క్లుప్తంగా

ఓటర్ల జాబితా సవరణను సద్వినియోగం చేసుకోండి


రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమైన ఆర్డీఓ

పెనుకొండ రూరల్: ఓటర్ల జాబితాలోని సవరణలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ ఆనంద్‌కుమార్ సూచించారు. శుక్రవారం అన్ని రాజకీయ పార్టీలతో కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. మార్పులు, చేర్పులు, తొలగింపు తదితర అంశాలపై చర్చించారు. రాజకీయ పార్టీలు బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకోవాలని సూచించారు.

బదిలీ ఎంఈఓకు సన్మానం


ఎంఈఓ రాఘవయ్యను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

అమరాపురం: మండల విద్యాధికారిగా విధులు నిర్వర్తిస్తూ ఇటీవల బదిలీపై పెనుగొండ ఎంఈఓ–1గా వెళ్లిన రాఘవయ్యను మండల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల విద్యాధికారి సత్యనారయణ ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు శ్రీనివాస్‌మూర్తి, నారాయణప్ప, విశ్వేశ్వర, తదితరులు ఎంఈఓ రాఘవయ్య సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాలీబాల్ ఫైనల్స్‌లో వైఎన్ హొసకోట గెలుపు


విజేత జట్టుకు కప్ అందిస్తున్న దృశ్యం

పావగడ: స్థానిక అంబేడ్కర్ క్రీడా మైదానంలో రెండు రోజులుగా సాగుతున్న అంతర్ పీయూ కళాశాలల క్రీడాపోటీలు రసవత్తరంగా సాగాయి. ఇందులో భాగంగా శుక్రవారం నిర్వహించిన వాలీబాల్ పోటీలు క్రీడాభిమానుల్లో ఎంతో ఆసక్తిని రేకెత్తించాయి. చివరకు స్థానిక ఎస్ఎస్‌కే పీయూ కళాశాల, వైఎన్ హొసకోట పీయూ కళాశాల మధ్య జరిగిన వాలీబాల్ ఫైనల్ మ్యాచ్ జరిగింది. ఉత్కంఠ పోరులో వైఎన్ హొసకోట కళాశాల జట్టు విజయం సాధించి కప్‌ను కైవసం చేసుకుంది. రెండు రోజులుగా నిర్వహించిన వాలీబాల్, షాట్‌పుట్, పరుగు పందెం, ఖోఖో, లాంగ్ జంప్, హై జంప్, కబ్బడి పోటీలు శుక్రవారంతో ముగిశాయి.

చిరుత దాడిలో మేక మృతి


చిరుత దాడిలో మృతి చెందిన మేక

గుడిబండ: చిరుత దాడిలో మేక మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని చిగతుర్పిలో చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాలమేరకు.. చిగతుర్పికి చెందిన రంగనాథ్ జీవాల పోషణతో జీవనం సాగిస్తున్నాడని పేర్కొన్నారు. గురువారం రాత్రి జీవాలను తన పొలం వద్ద దొడ్డిలో వదిలి ఇంటికి వెళ్లాడన్నారు. శుక్రవారం ఉదయం వెళ్లి చూసేసరికి ఓ మేక మృతి చెంది కనిపించిందని పేర్కొన్నారు. మెడపై చిరుత పంటి గాట్లను గుర్తించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారని తెలిపారు. డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ చాంప్లానాయక్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బీటీఓ పద్మావతి మేకకు పోస్టుమార్టం చేశారు. అటవీశాఖ అధికారి మాట్లాడుతూ కొండ ప్రాంతంలో చిరుత సంచరిస్తోందని, అప్రమత్తంగా ఉండాలని రైతులకు సూచించారు. అధికారులు త్వరగా బోను ఏర్పాటు చేసి చిరుతను బంధించాలని గ్రామ రైతులు, ప్రజలు కోరారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి


మృతి చెందిన పాడి ఆవు

లేపాక్షి: మండలంలోని కొండూరు గ్రామానికి చెందిన రైతు అశ్వత్థప్పకు చెందిన పాడి ఆవు శుక్రవారం ఉదయం విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. గ్రామంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర ఆవు గడ్డి మేస్తోంది. అయితే విద్యుత్ భూమిలోకి అర్త్ కావడంతో ఆవు అక్కడిక్కడే మృతి చెందిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ఆవు సుమారు రూ. 60 నుంచి రూ. 70 వేలు విలువ చేస్తుందన్నారు. పాడి రైతును ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

మట్టి గణపతినే పూజిద్దాం

- ఆర్డీఓ ఆనంద్‌కుమార్


ర్యాలీలో పాల్గొన్న ఆర్డీఓ ఆనంద్‌కుమార్, శిల్పా తదితరులు

పెనుకొండ: మట్టి గణపతే.. మహా గణపతి అని, ప్రతి ఒక్కరూ మట్టి గణపతినే పూజించాలని ఆర్డీఓ ఆనంద్‌కుమార్, షిర్డిసాయి గ్లోబల్ ట్రస్ట్ నిర్వాహకురాలు శిల్పా అనుపాటి సూచించారు. పట్టణంలో శుక్రవారం షిర్డిసాయి గ్లోబల్ ట్రస్ట్ నిర్వాహకురాలు శిల్ప అనుపాటి ఆధ్వర్యంలో మట్టి వినాయకులనే వినియోగించి పర్యావరణాన్ని పరిరక్షించాలన్న నినాదంతో వేలాది మంది విద్యార్థులతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం ట్రస్ట్ ఆవరణంలో సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ ఆనందర్‌కుమార్, శిల్ప తదితరులు పర్యావరణ ఆవశ్యకతను వివరించారు. ప్లాస్టాఫ్ పారిస్ వినాయక విగ్రహాలను వినియోగిస్తే నీరు, వాతావరణం, జీవరాశుల మనుగడకు కూడా ప్రమాదకరమన్నారు. సమావేశంలో డాక్టర్ నీలిమారెడ్డి, కరస్పాండెంట్ శ్రీనివాసులు, ఇంజనీర్ జగదీష్, బ్రహ్మకుమారీ మాత హేమలత, అనుపాటి మధుసూదన్‌రెడ్డి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన బార్ల పాలసీపై అవగాహన


వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ అధికారులు

హిందూపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నూతనంగా ప్రవేశపెట్టిన బార్ల పాలసీపై ఎక్సైజ్, ప్రొహిబిషన్ ఉన్నతాధికారులు శుక్రవారం స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో వ్యాపారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోవింద్‌నాయక్, ఏ.ఈ.ఎస్ నరసింహ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. హిందూపురంలో మొత్తం 4 నూతన బార్లను కేటాయించగా, అందులో 1 గీత కులాల వారికి కేటాయించామన్నారు. నూతన బార్ వ్యాపార సమయం ఉదయం 10 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకూ పొడిగించినట్లు చెప్పారు. సమావేశంలో ఎక్సైజ్ సీఐ లక్ష్మీ దుర్గయ్య, వ్యాపారులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ తనిఖీ చేసిన డీసీ

మడకశిర: మడకశిర ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆ శాఖ డీసీ నాగముద్దయ్య, జిల్లా ఏఈఎస్ నరసింహా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. మడకశిర ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ఇటీవల నమోదైన కేసుల వివరాలను తెలుసుకున్నారు. అక్రమంగా కర్ణాటక మద్యం రాకుండా నిఘా ఉంచి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. అలాగే మద్యం వ్యాపారులతో సమావేశమై బార్ పాలసీని వివరించారు. స్థానిక సీఐ మురళీకిషోర్, ఎస్ఐ శంకర్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చిలమత్తూరు: మండల పరిధిలోని 44వ నంబరు జాతీయ రహదారి అంజనితండా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. శుక్రవారం తుమ్మలకుంటకు చెందిన ఉపేంద్రరెడ్డి పని నిమిత్తం బాగేపల్లికి వెళుతుండగా అంజనీతాండా వద్ద వెనుక వైపు నుంచి మరో ద్విచక్ర వాహనం బలంగా ఢీకొంది. ఈ ఘటనలో ఉపేంద్రరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. అలాగే మరో వ్యక్తి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు తెలిసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతిభావంతులకు బహుమతుల ప్రదానం

పరిగి: మండలంలోని సేవామందిరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరంలో ప్రతిభను ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం శుక్రవారం జరిగింది. బీజేపీ సీనియర్ నాయకుడు బంగారు చంద్ర ఆర్థిక సౌజన్యంతో గతేడాది పాఠశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించిన యశ్వంత్, కుష్మంత్, ధీరజ్‌ను పాఠశాలలో హెచ్ఎం ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో మెమొంటోలు అందించి శాలవాలతో సత్కరించి, ప్రోత్సాహక బహుమతిని అందించారు.

వైద్య శిబిరానికి స్పందన

పావగడ: పట్టణంలోని బస్టాండు వద్ద ఉన్న ప్రసిద్ధి చెందిన నమ్మ ఆరోగ్య క్లినిక్ స్కానింగ్ సెంటర్, హెల్ప్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. తుమకూరులోని శ్రీదేవి ఆస్పత్రి ప్రముఖ వైద్యులు రోగులకు వైద్య సేవలందించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. నిర్వాహకులు మానం శశికిరణ్ రోగులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సేవలందించారు.